క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

అచ్చంపేట రూరల్: పని ఒత్తిడి, అవిశ్రాంతితో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారని, వారి అనారోగ్య పరిస్థితులను గమనించిన ఆర్టీసీ యాజమాన్యం ఆర్టీసీ డీఎం పి. మురళీదుర్గాప్రసాద్ అన్నారు. శనివారం అచ్చంపేట ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందితో పాటు వారి భాగస్వాములకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ వలంటీర్లు విజయలక్ష్మి, పద్మజ, ఆర్గనైజర్ బంధం శ్రీనివాసులు పాల్గొన్నారు.

4న అయ్యప్ప మాలధారణ

లింగాల: మండల కేంద్రంలోని అభినవ వీర మణికంఠ అయ్యప్ప ఆలయం ఆవరణలో ఈ నెల 4న సోమవారం అయ్యప్ప స్వామి దీక్షా మాలధారణ ఉంటుందని గురుస్వామి జేసీబీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9398310417, 9542708709 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

యువతకు ఉచితంగా డ్రోన్ శిక్షణ

కొల్లాపూర్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా డ్రోన్ శిక్షణ ఇవ్వనున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ వెల్లడించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని యువతకు వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్లపై అవగాహన కల్పించనున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ నిర్ణయించిందన్నారు. ఈనెల 5 వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద గల రత్నగిరి ఫౌండేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్‌నెం .9177050558కు ఫోన్ చేయాలన్నారు.

నేడు వినియోగదారుల దినోత్సవం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆదివారం 9 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీయర్ రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నలుగురి యువకుల బైండోవర్

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన నలుగురు యువకులను శనివారం తహసీల్దార్ కిరణ్మై ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. గ్రామానికి చెందిన యువకులు బెల్టు షాపు దగ్గర ఇరువర్గాల మధ్య పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఇదే అదునుగా చూసుకొని ఆ యువకులు తరచుగా గ్రామంలో రెచ్చగొట్టే సంఘటనలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతుండడం వల్ల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి మరోసారి ఇలాంటి సంఘటనలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించి వదిలేశారు.

నేడు భోగమహేశ్వరంలో శంకుస్థాపన

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం కింది కొండ భోగమహేశ్వరంలో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం ఉదయం 8గంటలకు పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి తెలిపారు. బోగమహేశ్వరంలో రూ. 50లక్షలతో పంచలింగాల ప్రతిష్ఠ, కల్యాణ మండపం, రూ.12లక్షలతో ప్రహరీ, రూ. 50లక్షలతో ఆంజనేయస్వామి ఆలయం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

7 నుంచి సదరం శిబిరాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగులు వారి సదరం సర్టిఫికెట్లను రిన్యువల్ చేసుకునేందుకు ఈ నెల 4 నుంచి స్లాట్ బుక్ చేసుకో వాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చిన్న ఓబులేష్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. శారీరక దివ్యాంగులకు ఈ నెల 7న, 14న, 21న, 28న క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారికి ఈ నెల 11, 18న క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి లోపం ఉన్నవారికి ఈ నెల 6, 25 మానసిక దివ్యాంగులకు, ఈ నెల 12న, 19 క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కులు మంజూరు

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గతేడాది విద్యుత్ ప్రమాదంలో మరణించిన గ్రామపంచాయతీ వర్కర్లు కేశంపేట రేణుక, బిజినేపల్లి చిట్టెమ్మలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల రూ.ల ఎక్స్‌గ్రేషియా చెక్‌లు మంజూరైనట్లు మాజీ సర్పంచ్ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్‌లకు మాజీ సర్పంచ్ సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

● ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేట బీఆర్ అంబేద్కర్ ప్రజాభవన్‌లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అంశాల సేకరణ కోసం పకడ్బందీగా చేపడుతున్న సర్వేకు గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల గుర్తింపునకు వచ్చే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు వ్యక్తిగత, కుటుంబ వివరాలు తెలియజేసేలా ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. రెండు నెలల్లో ఇది పూర్తవుతుందని, అన్ని ప్రభుత్వ శాఖలు ఈ సర్వేలో పాల్గొంటాయన్నారు.కార్యక్రమంలో గ్రంథాయల చైర్మన్ జి.రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్, ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, కౌన్సిలర్ గౌరిశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎ.గోపాల్‌రెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

అండర్–14 విభాగంలో ఖోఖో క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రాణించిన అచ్చంపేట ఎంఎస్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ, స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సీఎంరెడ్డి, పడిత్‌రావు, మాజీ జెడ్పీటీసీలు మన్త్రానాయక్, అనంత ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పాలశీతలీకరణ చైర్మన్ ప్రమాణ స్వీకారం

అచ్చంపేట ఎన్‌టీఆర్ మినీస్టేడియంలో అచ్చంపేట పాలశీతలీకరణ చైర్మన్‌గా దొడ్ల నర్సయ్యయాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో ఎమ్మెల్యే, స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. యాదవులు పాడికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని, ఈ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా చేశామన్నారు.

అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ లావుడ్య మహేష్ అరుదైన శస్త్రచికిత్సలు చేస్తూ ప్రజల ప్రశంసలు పొందుతున్నాడు. స్థానిక ఆస్పత్రిలో ఓ వృద్ధుడికి ప్లాస్టిక్ సర్జరీ చేయడం గమనార్హం. ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్‌కు చెందిన దేవయ్య(62) కుడి చేతికి ఇన్‌ఫెక్షన్ అయ్యి చాలా రోజులుగా బాధపడుతున్నాడు. రెండు నెలల కిందట అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలోని వైద్యుడు మహేష్‌ను సంపదరించగా పలు రకాల మందులు రాశాడు. అయిన ప్పటికీ నయం కాకపోవడంతో ప్లాస్టిక్ సర్జరీ చేయాలని సూచించాడు. అయితే ప్రైవేటు ఆస్పత్రిలో చూయించుకునే స్తోమత లేదని బాధితుడు చెప్పడంతో ఎలాగైనా ఆస్పత్రిలోనే ప్లాస్టిక్ సర్జరీ చేస్తానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభుతో మాట్లాడి శనివారం ఆస్పత్రిలోనే 3 గంటల పాటు శ్రమించి ప్లాస్టిక్ సర్జరీని విజయవంతంగా చేశాడు. వైద్యుడు మహేష్ సేవలను రోగి బంధువులు, పలువురు అభినందించారు. గతంలోనూ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులలో వైద్యుడు మహేష్ దగ్గరుండి ఆపరేషన్లు చేసిన సంగతి తెలిసిందే.



వైద్యుడు మహేష్

మర్రిపల్లిలో వైద్య శిబిరం

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో డెంగీ జ్వరంతో బాలుడు శివర్ధన్ యాదవ్(5) మృతి చెందిన ఘటన జరగడంతో శనివారం ఉప్పునుంతల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి ఫివర్ సర్వే చేశారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పైరత్రం స్ప్రే చేయించి మురుగు ఉన్న చోట, డ్రైనేజీలో వెంట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. వారు ప్రైవేట్ ఆస్పతుల్లో చికిత్సలు అందించిన మెడికల్ రిపోర్టులను పీహెచ్‌సీ డాక్టర్ స్వప్న పరిశీలించారు. మెడికల్ రిపోర్టులను జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి(డీఎంఅండ్‌హెచ్‌ఓ)కు పంపించగా, వాటిని పరిశీలించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ బాలుడికి నిమోనియా, కాలేయవాపుకు గురికావడం, పిత్తాశయానికి ఇన్ఫెక్షన్ సోకడంతో చనిపోయినట్లు తెలుపడం జరిగిందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి తెలిపారు.



బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి, సిబ్బంది

ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలి



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనునాయక్



పెద్దకొత్తపల్లిలో ఇంటింటి సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి పట్టణంలో ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ మహమూద్ షేక్ సూచించారు. పట్టణంలో చేపడుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేపై మున్సిపాలిటీకి కేటాయించిన సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

● వెల్దండ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా ఇళ్లను గుర్తిస్తున్నారు. 150 ఇళ్లను గుర్తించి వాటికి ప్రత్యేకంగా స్టిక్కర్లు వేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ అవరణలో సర్వేపై ఉపాధ్యాయులకు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు.

● తాడూరులో ఇన్‌చార్జి ఎంపీడీఓ బ్రహ్మచారి, తహసీల్దార్ కిరణ్మై, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే వివరాలపై అవగాహన కల్పించారు.

● లింగాలలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ పాండునాయక్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్వేకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు.

● అమ్రాబాద్‌లో సర్వేపై సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా ఎంపీడీఓ వెంకటయ్య, తహసీల్దార్ శైలేంద్రకుమార్‌లు వివరించారు.

● తెలకపల్లి మండల కాంప్లెక్స్ మీటింగ్‌హాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ జాకీర్‌పాష, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు అవగాహన కల్పించారు.

● చారకొండలో రైతు వేదిక కార్యాలయంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ఉపాధ్యాయులకు అవగాహన నిర్వహించారు.

● పెద్దకొత్తపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి సర్వేపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యుమరేటర్‌లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఎంపీడీఓ నాగేందర్ నిర్వహించారు.

● కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సర్వేకు ఎంపికైన ఎన్యుమరేటర్లకు ఆర్‌డీఓ శ్రీనునాయక్ అవగాహన కల్పించారు.

ఓటు ప్రజాయుధం



తెలకపల్లి: ఓటు ప్రజాయుధమని తహసీల్దారు జాకీర్‌ఆలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎల్‌ఆర్ విద్యా సంస్థలలో ఓటు హక్కు నమోదు బ్రోచర్లను ప్రారంభించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ రామస్వామి, శ్రీనివాసరావు, విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, ఇబ్రహీం, ప్రిన్సిపల్స్ సందీప్‌కుమార్, మహాత్మాజ్యోతిరావు పూలే కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షిత ఎంపికైంది. ఇటీవల కోయిలకొండలో నిర్వహించిన అండర్–14 పోటీలలో అక్షిత అద్భుతమైన ప్రదర్శన చేసింది. కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అక్షితను శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు.

పెద్దపల్లి విద్యార్థిని..

తెలకపల్లి: రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్ పోటీలకు పెద్దపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని విజయలక్ష్మి ఎంపికై నట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్తమ ప్రతిభ చూపింది. నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినదించారు.

కబడ్డీ పోటీలకు నాగర్‌కర్నూల్‌వాసి..

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలకు నాగర్‌కర్నూల్‌కు చెందిన దామోదర్ ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు ఒక ప్రకటనలో తెలిపారు. కోయిల్‌కొండలో అండర్–14 బాలికలకు నిర్వహించిన ఖోఖో పోటీలలో ప్రతిభ కనబర్చిన శిరీష, వైష్ణవి, వసంత, నందినిలను డీఈఓ గోవిందరాజులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాండు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం

అచ్చంపేట రూరల్: అంబులెన్స్‌లో ఓ మహిళ కవలలకు జన్మనిచ్చింది. మండలంలోని పల్కపల్లికి చెందిన కవితకు పురిటి నొప్పులు రావడంతో 108లో అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో నార్మల్ డెలివరీ చేశారు. పండంటి కవల మగ బిడ్డలకు ఆమె జన్మనిచ్చింది. ఈఆర్‌సీపీ డాక్టర్ స్మిత, ఈఎంటీ తిర్పతయ్య, పైలట్ సైదులును మహిళ కుటుంబ సభ్యులు, 108 జిల్లా మేనేజర్ బోయిని శ్రీను అభినందించారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ఉప్పునుంతల: పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని మొల్గర ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. తల్లిదండ్రులను సంప్రదించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించడానికి కృషి చేయాలని చెప్పారు.

ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామాలలో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసుకున్న పంటలకు సాగునీరు ఇవ్వడంలో ఇరిగేషన్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీడీఓ కార్యాలయ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం నర్సింహారెడ్డి అధ్యక్షత వహించారు. ఇరిగేషన్ డీఈ రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ కోటేశ్వర్, గౌరవ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తెలకపల్లి: ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ ఓబులేష్ అన్నారు. శనివారం మండలంలోని గౌరారంలో గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామస్తులకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఓబులేషతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్‌రెడ్డి, బ్యాంకుమిత్రులు మందరి పార్వతి, గిరిజ, గ్రామస్తులు మల్లయ్య, భీమయ్య, వెంకటయ్య, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోన్న కాంగ్రెస్



కొల్లాపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు ఆరోపించారు. నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు 42 వేలు దాటిన సందర్భంగా కొల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందకు పైగా సభ్యత్వాలు చేయించిన నాయకులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. పట్టణంలో ర్యాలీగా తిరుగుతూ ప్రధాన రహదారి వెంట సభ్యత్వ నమోదు చేపట్టారు.ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ధారాసింగ్, శేఖర్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, సందు రమేష్, సాయికృష్ణగౌడ్, కేతూరి నారాయణ, భరత్‌చంద్ర, అన్వేష్, భీమేష్, గోపీనాయుడు, శివకృష్ణ, వెంకటస్వామి, కల్పనారెడ్డి తదితరులున్నారు.

ఉత్తమ ఫొటోగ్రఫీ అందుకున్న మహేష్

పెద్దకొత్తపల్లి: ఇండియన్ ఇంటర్‌నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఫొటోగ్రఫీ అకాడమిక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా విజయవాడలో ప్రపంచఫొటో దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో పెద్దకొత్తపల్లికి చెందిన పిట్టల మహేష్ ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును డా సుందర్‌రాజు, కొంపల్లి జస్టిస్ కే మన్మదరావు, శాసన సభ్యులు, మండలి బుద్ద ప్రసాద్, మాజీ పార్లమెంట్ సభ్యుడు బోగరాజుగంగరాజు అవార్డును మహేష్‌కు అందజేశారు. ఈ సదర్భంగా మహేష్‌ను పెద్దకొత్తపల్లి ఫొటోగ్రఫర్ల సంఘం నాయకులు డేగరాజు, శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి



వెల్దండలో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఉచిత విద్యుత్‌కు దరఖాస్తులు చేసుకోవాలని విద్యుత్ ఏఈ సూర్యం పేర్కొన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు బృందాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏఈ వివరించారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ కోసం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించిదని, అర్హులందరు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి ప్రత్యేక అధికారులు జేఏఓలు నిరంజన్, గోపాల్, సినియర్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది వెంకటస్వామి, మాదవులు, లక్ష్మణ్, రామకృష్ణ, గిరి, రాజు, తిర్పతయ్య, సికిందర్ ఉన్నారు.

దాతల సహకారం వినియోగించుకోవాలి

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు గ్రామ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన దాత విజయ్‌కుమార్ రూ.50 వేల వాటర్ ప్యూరిఫైర్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహన్‌సాగర్ ఆధ్వర్యంలో విజయ్‌కుమార్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఆసియాసుల్తానా, గ్రామస్తులు బుచ్చిరెడ్డి ఉన్నారు.

స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక

తెలకపల్లి: మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వేరోస్ మండలాధ్యక్షుడిగా మిద్దె ధర్మరాజు, ఉపాధ్యక్షుడిగా గుగ్గిళ్ళ రాజేష్, ప్రధాన కార్యదర్శిగా జగన్, జాయింట్ సెక్రటరీగా రామస్వామి, విష్ణు, కోశాధికారిగా శివ, ప్రతినిధిగా రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివశంకర్‌తో పాటు జిల్లా జాయింట్ సెక్రటరీ మబ్బు రాము పాల్గొన్నారు.

ప్రారంభమైన అంజన్న మాలధారణ



ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాలధారణ స్వీకరిస్తున్న అంజనేయస్వాములు



నాగర్‌కర్నూల్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం కిందికొండ బోగమహేశ్వరం అంజనేయస్వామి ఆలయం వద్ద మద్దిమడుగు పబ్బతి అంజనేయస్వామి మాలధారణ స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆంజనేయస్వామి భక్తులు మొదటి రోజు వివిధ గ్రామాలకు చెందిన వంద మంది మాలధారణ స్వీకరించారు. ఉమామహేశ్వరం ఆలయం నుంచి అంజనేయస్వామి మాలధారణ చేపట్టిన భక్తులకు ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవ్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రావు, గురుస్వాములు జయరాం, శత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసంలో మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు దత్తుశర్మ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస శర్మ, మహేశ్ పాల్గొన్నారు.

శివ దీక్ష ఆరంభం

కల్వకుర్తిరూరల్: పవిత్ర కార్తీక మాసంలో శివయ్యను భక్తి పూర్వకంగా స్మరిస్తే ఎంతో శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం. అయ్యసాగర్ శివాలయంలో గురుస్వామి ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివ మాలలు ధరించి శివునికి అభిషేకం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజుయాదవ్, శ్రీనివాస్ రెడ్డి, జంగయ్య, సాయిగౌడ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో సామూహికంగా పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, సామూహిక దీపారాధనలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు కందడై శ్రీనివాసాచార్యులు, అర్థం రవీందర్, మల్లేష్, పుల్లయ్య, నందకిశోర్, మణ్యపురెడ్డి, రంజిత్, శ్రీను, శివ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆయాల్లో పూజలు

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి, శాయిన్‌పేట తదితర గ్రామాల్లో కార్తీకమాసం పూజలు నిర్వహించుటకు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్తీకమాసం పూజలు ప్రారంభం

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలాల్లో కార్తిక మాసం పూజలు ప్రారంభమయ్యాయి. అమ్రాబాద్ అమరేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గంగిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.



పదరలో ఆకాశదీపాన్ని తిలకిస్తున్న భక్తులు

గిట్టుబాటు ధర కల్పించాలి



తాడూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సీసీఐ ప్రారంభించి పత్తిని కొనుగోలు చేయాలని డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ అన్నారు. మండలంలోని ఐతోల్‌లో శనివారం పంటలను పరిశీలించిన అనంతరం బస్టాండ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాటలలోనే ప్రజాపాలన చెప్పుకోవడం తప్ప, ఆచరణలో మాట నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. స్వయం ఉపాధి పథకాలు అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. భగవంత్, బాలు, నరసింహులు, వెంకటయ్య, బహుగుణ పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపు హర్షణీయం

సాక్షి, నెట్‌వర్క్: వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్ తెలిపారు. గత ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. గతంలో ఉన్న రేట్లకు 40 శాతం ఎక్కువ చేస్తూ డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీల పెంపుపై కోడేరులో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట మండలం ఐనోలు గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పీవీటీజీ) విద్యార్థినులు 'థాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

● హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు ప్రభుత్వం పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై కల్వకుర్తి పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని బీసీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు కేక్ కట్‌చేసి సంబురాలలో పాల్గొన్నారు.

● గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన గురుకులం (పీటీజీ) మన్ననూర్ విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా ప్రిన్సిపల్ గోవర్ధన్ మాట్లాడారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న సంతోష్



కోడేరులో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



కల్వకుర్తి గురుకుల పాఠశాలలో సంబురాలు



మన్ననూర్‌లో ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్న గిరిజన విద్యార్థులు